సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 26 । జూలై । 2024



ప్రాణభిక్ష పెట్టండి

రెండున్నరేళ్ల బాలుడు కేన్సర్ బారిన పడ్డాడు. చికిత్స చేయించడానికి తల్లిదండ్రులు సాయం కోరుతున్నారు. - 8లో



ఇబ్బంది రాకూడదు..

సీఆర్‌జెడ్ అమలుపై ప్రజాభిప్రాయం సేకరించారు. మత్స్యకారులకు ఇబ్బంది కలగకూడదని అంతా అన్నారు. - 8లో

జిల్లాకు వస్తున్న తహసీల్దార్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నిబంధనల్లో భాగంగా జిల్లాలో పనిచేసిన తహసీల్దార్లు జోన్-1లో ఉమ్మడి విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు బదిలీ అయ్యారు. వారంతా ఇప్పుడు తిరిగి వస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయగా, తాజాగా అనకాపల్లి జిల్లాలో పనిచేసిన జిల్లాకు చెందిన తహసీల్దార్లను రిలీవ్ చేశారు. మిగిలిన జిల్లాల వారు కూడా శుక్ర, శనివారాల్లో రిలీవ్ కానున్నారు. వీరంతా రెండు రోజుల్లో కలెక్టర్‌కి రిపోర్టు చేయనున్నారు. మన జిల్లాలో ఎన్నికల సమయంలో పనిచేసిన తహసీల్దార్లు వారి సొంత జిల్లాలకు వెళ్తున్నారు.

న్యూస్‌రీల్

31న పాలిటెక్నిక్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్ల నిర్వహణకు సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు సీటు కోరుకునే కళాశాలకు విద్యార్థులు ఈ నెల 31వ తేదీన హాజరు కావాల్సి ఉంటుంది. పాలీసెట్-2024 ర్యాంకు, ర్యాంకు లేని విద్యార్థులకు 10వ తరగతి అర్హతగా సీట్లు కేటాయిస్తారు. పాలిటెక్నిక్ ప్రవేశాలకు రెండు విడతలు కౌన్సెలింగ్ నిర్వహించగా, ఉమ్మడి జిల్లా పరిధిలో 10 కళాశాలల్లో 2699 సీట్లకు 1362 ప్రవేశాలు జరిగాయి. 1337 ఖాళీ సీట్లు ఉన్నాయి. ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 752 సీట్లకు 557 సీట్లు, ఐదు ప్రైవేట్ కళాశాలల్లో 1947 సీట్లకు 805 ప్రవేశాలు జరిగాయి. ప్రభుత్వ కళాశాలలకు సంబంధించి ప్రవేశాలు పరిశీలిస్తే శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 295కి 275, శ్రీకాకుళం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 99 సీట్లకు 94, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 132 సీట్లకు 126, టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 118 సీట్లకు 38, సీతంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 108 సీట్లకు 24 ప్రవేశాలు జరిగాయి. టెక్కలి, సీతంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఎక్కువ సీట్లు మిగిలిపోయాయి. స్పాట్ అడ్మిషన్లకు ఫీజురీయింబర్స్‌మెంట్ వర్తించదు. ఉదయం పూట దరఖాస్తుల స్వీకరణ, మధ్యాహ్నం పూట ప్రవేశాలు నిర్వహిస్తారు. కాలేజ్ ఫీజు స్ట్రక్చర్ మేరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

డ్రోన్ టెక్నాలజీపై ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ రజని, రోసెస్ కంపెనీ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అధికారులు డ్రోన్ టెక్నాలజీ శిక్షణ షార్ట్ టర్మ్ కోర్సు నిర్వహణకు విశాఖపట్నంకు చెందిన రోసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో గురువారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు వర్సిటీలో వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజినితో కూడిన అధికారులు, రోసెస్ కంపెనీకి చెందిన సీఈఓ ఎస్‌కేవీ సతీష్ ఎంఓయూపై సంతకాలు చేసి, ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీలో 50 రోజుల వ్యవధితో కూడిన సల్పకాలిక శిక్షణలు విశ్వవిద్యాలయం ప్రారంభించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

ఆగస్టు 15 తర్వాత గ్రిగ్స్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: ఆటలపై విద్యార్థులకు ఉండే ఇష్టాన్ని వెలికి తీసేందుకు గ్రిగ్స్ పోటీలు ఏటా నిర్వహిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక మునసబుపేటలోని గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీలో గురువారం స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గ్రిగ్ పోటీల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌పై ఫిజికల్ ఎడ్యుకేషనల్ ఉపాధ్యాయులతో డివిజన్ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15 తర్వాత గ్రిగ్ పోటీలు నిర్వహించేందుకు తీర్మానించారు. ముందుగా మండల స్థాయి, జోనల్, జిల్లా స్థాయి తర్వాత రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించేందుకు కమిటీ తీర్మానించినట్లు డీఈఓ తెలిపారు. 6వ తరగతి నుంచి 10 తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు, ప్రైవేటు స్కూల్ వారు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ విజయకుమారి, ఎంఈఓ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పి.దాలినాయుడు, ఫిజికల్ ఎడ్యుకేషనల్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ట్రాక్టర్లలో బ్యాటరీలు చోరీ

టెక్కలి: టెక్కలి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం రేయింబవళ్లు నిరీక్షిస్తున్న ట్రాక్టర్ యజమానులకు దొంగల బెడద తలనొప్పిగా మారింది. ఉదయాన్నే మొదటి విడతగా ఇసుక కొనుగోలు కోసం రాత్రి పార్కింగ్ చేసిన ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. అర్ధరాత్రి సమయంలో ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు, ఇతర సామగ్రిని దొంగిలిస్తున్నారు. దీంతో ట్రాక్టర్ యజమానులు లబోదిబోమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉచిత ఇసుక అని నమ్మబలికి డబ్బులకే ఇసుక అమ్మకాలు చేయడంతో మోసపోయిన తమకు ఇప్పుడు దొంగల బెడదతో మరింత నష్టపోయామని ట్రాక్టర్ యజమానులు ఆవేదన చెందుతున్నారు.

ఎస్‌ఎంపురంలో టీడీపీ నాయకులు అక్రమంగా చదును చేసి ఆక్రమించుకున్న భూములివే



ఐదేళ్ల ఆకలి..

గురుకుల భూములు బలి



- ఎస్‌ఎం పురం గురుకుల భూముల ఆక్రమణ
- దర్జాగా చదును చేసేస్తున్న టీడీపీ నాయకులు
- ఆక్రమణదారులు టీడీపీ జిల్లా నాయకుడు చౌదరి బాబ్జీ అనుచరులుగా ముద్ర
- అధికారం రావడంతో చెలరేగిపోతున్న వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఎన్నికలు అయిపోయాక.. అధికారం చేతులు మారాక.. జిల్లాలో దౌర్జన్యాలు చూశాం. దాడులు గమనించాం. వేధింపులు, బెదిరింపుల గురించి కూడా విన్నాం. వీటికి తోడుగా జిల్లాలో ఆక్రమణల పర్వం కూడా మొదలైంది. ఐదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న కొందరు టీడీపీ నాయకులు ఇప్పుడు అక్రమాల ఆకలి తీర్చుకునే పని మొదలు పెట్టారు. అందులో ఎచ్చెర్ల నియోజకవర్గం ముందుంది. తాజాగా టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జీ అనుచరులు ఏకంగా ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలకు కేటాయించిన భూములనే ఆక్రమించేస్తున్నారు. ఎస్‌ఎంపురం గ్రామంలోని గురుకుల పాఠశాల భూములను కళ్ల ముందటే దర్జాగా ఆక్రమించి, చదును చేసేస్తున్నారు. ఈ భూములు రూ.కోట్లు విలువ చేస్తాయి. అయినా అధికార యంత్రాంగం కిక్కురుమనడం లేదు.

అప్పట్లోనే బీజం..

ఎచ్చెర్ల మండలం ఎస్‌ఎంపురంలో 1984లో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ పేరుతో స్థానికుల నుంచి భూములను కొనుగోలు చేశారు. సంపతిరావు, వావిలపల్లి, గురుగుబిల్లి కుటుంబ సభ్యుల నుంచి సర్వే నంబర్ 234, 235, 237లో 13.7 ఎకరాలను సొసైటీ కొనుగోలు చేసింది. ఇది కాకుండా సర్వే నంబర్ 112లో ప్రభుత్వం మరో 40 ఎకరాల ప్రభుత్వ భూమిని గురుకుల పాఠశాలకు కేటాయించింది. మొత్తంగా సుమారు 54 ఎకరాలు రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ పేరు మీదే ఉంది. ఈ భూముల్లో కొంతమేర భవనాలు నిర్మించారు. మిగతా భూమిని భవిష్యత్ అవసరాల కోసం ఉంచారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పుడు ఒకరిద్దరు గురుకుల పాఠశాల భూములను ఆక్రమించి, చదును చేసి నీలగిరి మొక్కలు వేసేశారు. అవే భూముల్లో అప్పట్లో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని అక్రమంగా నిర్మించేశారు. రోడ్డును కూడా వేశారు. ఇదంతా గతం.

మళ్లీ ఇప్పుడు..

ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో ఖాళీగా ఉన్న గురుకుల పాఠశాల మిగతా భూములపై ప్రస్తుతం పడ్డారు. కొండలరావు, మహేష్, గణపతిరావు, గోవిందరావు తదితరులు తాజాగా రెండెకరాల వరకు గురుకుల పాఠశాల భూములను అక్రమంగా చదును చేసి తమ గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. వీరిలో ఇద్దరు ఏకంగా ఆ ఆక్రమిత భూమిలో స్తంభాలు కూడా పాతేశారు. వీరంతా చౌదరి బాబ్జీ అనుచరులుగా స్థానికులు చెప్పుకుంటున్నారు. అధికారం అండతోనే చెలరేగిపోతున్నట్టుగా ఆరోపణలు కూడా వస్తున్నాయి.

ఎస్‌ఎంపురంలో కబ్జాలే కబ్జాలు

జిల్లా కేంద్రానికి దగ్గరగా, కీలకమైన విద్యాలయాలు సమీప ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్ల ఎస్‌ఎంపురం గ్రామ భూముల విలువ భారీగా పెరిగింది. దీంతో కొండలు, గుట్టలు, చెరువులు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసేస్తున్నారు. ఇక్కడ ఆక్రమణలు సర్వసాధారణమైపోయింది.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

ఎస్‌ఎంపురం గురుకుల పాఠశాలకు చెందిన భూములను అక్రమించి, చదును చేసిన విషయాన్ని తహసీల్దార్ శ్యామ్ కుమార్ దృష్టికి 'సాక్షి' తీసుకెళ్లింది. దీనిపై ఆయన స్పందిస్తూ పరిశీలించి, కబ్జా చేస్తే నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటామని, ఆక్రమణలను ఉపేక్షించేది లేదని తెలిపారు.

వారంతా చౌదరి బాబ్జీ అనుచరులే

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు గతంలో విక్రయించిన భూములను తిరిగి తీసుకోవడానికి లేదు. ప్రభుత్వం వచ్చిందని తీసేసుకుంటే సరిపోదు. పార్టీకి చెడ్డ పేరు. ఇదంతా చౌదరి బాబ్జీ అనుచరులే చేస్తున్నారు. గ్రామస్తులందరికీ తెలుసు.

– సంధ్య గజపతిరావు చౌదరి, టీడీపీ విజయనగరం జిల్లా అధికార ప్రతినిధి

ఎవరు చేసినా తప్పే

గురుకుల పాఠశాల భూములు ఆక్రమించడం తప్పే. ఎవరు చేసినా చర్యలు తీసుకోవాలి. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. ఒకరిని చూసి ఇంకొకరు ఆక్రమిస్తున్నారు. మొదటి వాడిపైన చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. తెలుగుదేశంలో ఎవరైనా చేస్తే వాళ్లంతా నా అనుచరులే అని బదనాం చేయడం సరికాదు.

– చౌదరి నారాయణమూర్తి(బాబ్జీ), టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు.

అధికారం అండతో కబ్జా

ప్రభుత్వ భూమిని ఆక్రమించడం తప్పు. అధికారం అండతో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు. తాజాగా గోవిందరావు, గణపతిరావు, అంతకు ముందు కొండలరావు, మహేశ్వరరావు ఆక్రమణలకు పాల్పడ్డారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

– వావిలపల్లి కళా ప్రతాప్, గ్రామస్తుడు, ఎస్‌ఎంపురం

కోర్టు తీర్పు ఇలా..

తమ కుటుంబ సభ్యులే అప్పట్లో రెసిడెన్షియల్ సొసైటీకి భూములు విక్రయించారని, ఆ భూములను 20 ఏళ్ల లోపు వినియోగించకపోతే తిరిగి అసలు యజమానుల కుటుంబీకులు స్వాధీనం చేసుకుని, తమ అవసరాలకు వినియోగించుకోవచ్చన్న కారణాలు చూపించి గురుకుల పాఠశాల భూములను ముగ్గురు దర్జాగా చదును చేసి ఆక్రమించారు. వాస్తవంగా రెసిడెన్షియల్ సొసైటీ కొనుగోలు చేసిన భూములకు ఆక్రమణదారులు చెప్పిన నిబంధన వర్తించదు. సొసైటీ పేరుతో రిజిస్టరైన భూములను భవిష్యత్‌లో అవసరాల దృష్ట్యా ఎప్పుడైనా వినియోగించుకోవచ్చు. మరొకరు డీ పట్టా ఉందని అక్రమంగా చదును చేసేస్తున్నారు. ఇదే వాదనతో అప్పట్లో రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీకి భూమి విక్రయించిన ఓ కుటుంబానికి చెందిన వ్యక్తి కోర్టుకు కూడా వెళ్లారు. తమ నుంచి కొనుగోలు చేసిన భూమి రెసిడెన్షియల్ స్కూల్ అవసరాలకు వినియోగించలేదని, ఆ భూమిని తిరిగి తమకు అప్పగించాలని కోర్టులో పిటీషన్ వేశారు. అయితే ఆ నిబంధన రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీకి వర్తించదని ఆ పిటీషన్‌ను కోర్టు కొట్టి వేసింది. ఇప్పుడు కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి రెసిడెన్షియల్ స్కూల్ భూములపై తెగబడటం చర్చనీయాంశంగా మారింది.



ఎస్‌ఎంపురం గురుకులం

ఎరువుల పంపిణీలో టీడీపీ నాయకుల జులుం



చింతలపేట సచివాలయం ఆవరణలో టీడీపీ నేతలు తాళం వేసిన ఎరువుల గోదాం

ఆమదాలవలస: మండలంలోని చింతలపేట సచివాలయం భవనంలో ఎరువులను నిల్వ ఉంచిన గదికి ఆ గ్రామ టీడీపీ కార్యకర్తలు నేతింటి జ్యోతీశ్వరరావు, కంచు దాలినాయుడు బుధవారం సొంత తాళాలు వేసి ఎరువుల పంపిణీ అడ్డుకున్నారు. తమ వారికి ఎరువులు పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చాక గురువారం ఆ తాళాలు తెరిచారు. ఆ గ్రామానికి చెందిన రైతులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.జయమాధురి ఆ సచివాలయ పరిధిలో వచ్చిన ఎరువులు యూరియా 440 బ్యాగులను గోదాంలో వేసి పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. అయితే సర్పంచ్ ప్రతినిధులకు ముందుగా 200 బ్యాగులు కావాలని, అవి ఇచ్చాకే మిగతావి పంపిణీ చేయాలని కొందరు అడ్డుకున్నారు. అదే క్రమంలో ఆ గోదాం నుంచి ఎవరికీ ఎరువులు ఇవ్వకుండా తమ సొంత తాళాలు వేశారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావుకు గ్రామ సహాయకురాలు జయమాధురి చెప్పారు. దీంతో టీడీపీ కార్యకర్తలకు వేరే ఆర్‌కేబీ నుంచి మరో 100 బ్యాగులు ఇండెంట్ పెట్టి అక్కడికి పంపిస్తానని, ఆ షెట్టర్ తాళాలు తీయాలని ఆయన కోరారు. దీంతో గురువారం ఉదయం టీడీపీ కార్యకర్తలు తాళం తెరిచి వ్యవసాయ శాఖ అధికారులకు గోడౌన్ ఇచ్చారు. దీంతో ఎట్టకేలకు ఎరువుల పంపిణీ చేయగలిగారు. అయితే గ్రామంలో రైతులకు పూర్తి స్థాయిలో ఎరువులు అందించకుండా ఒకే వర్గం రైతులకు అందించారని ఆ గ్రామానికి చెందిన రైతులు పేడాడ శశిభూషణరావు, కంచు శ్రీరాం, పంగ బాలసుందర్రావు, సీపాన అప్పలనాయుడు, సీపాన త్రినాథరావు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయానికి తాళం వేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా విడిచి పెట్టి చోద్యం చూస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఆర్‌జీయూకేటీ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాది ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఎస్‌ఎంపురం క్యాంపస్‌లో ఏర్పాట్లు పూర్తిచేశారు. 10వ తరగతి మార్కులు, రిజర్వేషన్ రోస్టర్, ప్రత్యేక కేటగిరీల ఆధారంగా ఈ నెల 11న మెరిట్ లిస్ట్ విడుదల చేశారు. 1100 సీట్లకు 1110 మందితో మెరిట్ లిస్ట్ విడుదల చేశారు. ప్రత్యేక కేటగిరీలకు సంబంధించి న్యూజివీడులో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

- శ్రీకాకుళం క్యాంపస్‌లో 1036 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు.
- శుక్రవారం 515, శనివారం 521 మంది ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు.
- రెండు రోజులు ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయ్యాక గైర్హాజరైన విద్యార్థులకు మళ్లీ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారు.
- పూర్తిగా హాజరు కాని విద్యార్థుల స్థానంలో మెరిట్ ఆధారంగా లిస్టు ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తారు.
- క్యాంపస్‌లో 15 కౌంటర్లు ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం ఏర్పాటు చేశారు.
- క్యాంపస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు కౌన్సెలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించారు.
- దరఖాస్తు సమయంలో విద్యార్థులు అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.
- బీసీ, ఓసీ విద్యార్థులు రూ.4200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.3700 కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు రూ.45,000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- పూర్తిగా రెసిడెన్సియల్ విధానంలో విద్యాబోధన సాగుతుంది.
- సీటు లభించిన విద్యార్థులకు వసతి గృహాల్లో గదులు కేటాయిస్తారు.
- షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏఓ ముని రామకృష్ణ చెప్పారు.
- ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

'తగిన సిబ్బంది లేకనే ఇబ్బందులు'



మాట్లాడుతున్న ఈఓ చంద్రశేఖర్

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయ కార్యాలయంలో క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతోనే చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, దీనిపై దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదించానని ఆలయ ఈఓ, డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ స్పష్టం చేశారు. గురువారం ఆలయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయంలో ఇటీవల చోటుచేసుకున్న పలు పరిణామాలు, ప్రగతి తదితర విషయాలను ఆయన ప్రస్తావించారు. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో 48 మంది వరకు దినసరి వేతనదారులు పనిచేస్తున్నారని, వీరికి గత ఆరు నెలలుగా జీతాలు కూడా చెల్లించాల్సి ఉందని, దీనిపై కూడా ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. అలాగే ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన కృష్ణమాచార్యులుపై పలు అభియోగాలు ఉన్నందున డీసీ సుజాత ఆధ్వర్యంలో విచారణ జరిగిందని త్వరలో చర్యలుంటాయని ప్రకటించారు. దినసరి వేతనదారుల్లో కొందరిపై ఆరోపణలు చేస్తూ పలు పత్రికల్లో కథనాలు వస్తున్నాయని, దయచేసి పత్రికల్లో వార్తలు ఆధారాలతో ప్రచురించాలని, అవాస్తవాలు ప్రచురిస్తే ఆలయ ప్రతిష్టకే భంగం కలుగుతుందని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. దినసరి వేతనదారుల కొనసాగింపుపై కూడా త్వరలో నిర్ణయాలను ప్రకటిస్తారని తెలిపారు.

గత ప్రభుత్వ హయంలోనే నిధులు

గత ప్రభుత్వ హయాంలో ఇంద్రపుష్కరిణి అభివృద్ధికి రూ.4 కోట్లు నిధులు మంజూరు చేసి పనులకు టెండర్ ఖరారు చేశారని, అయితే గడువు ముగుస్తున్నా సంబంధిత టెండర్ దారుడు ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఇంద్రపుష్కరిణి అభివృద్ధికి సంబంధించి డిజైన్లు మళ్లీ మార్చుతున్నామని, స్థానిక మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే శంకర్‌ల సూచనల మేరకు త్వరలో తదుపరి చర్యలు చేపడతామన్నారు.

నేడు నూతన జేసీ బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌ను కలిసిన కొత్త జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాకు నూతన జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం శ్రీకాకుళం చేరుకున్నారు. అన్నమయ్య జిల్లాలో జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వచ్చిన ఆయన తొలుత కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలెక్టర్ బంగ్లాలో గౌరవ పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

28న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 28న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 2వ, 11 గంటలకు 4వ, 12 గంటలకు 1వ, ఒంటి గంటకు 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని, అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు 6వ, 4 గంటలకు 3వ, సాయంత్రం 5 గంటలకు 5వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయతో పాటు ఉపాధ్యక్షులు సిరిపురపు జగన్మోహనరావు, పాలిన శ్రావణితో పాటు సభ్యురాలు జంపు కన్నతల్లి అధ్యక్షతన ఈ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని ప్రకటించారు.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న విద్యార్థులు



పోలింగ్‌ను పరిశీలిస్తున్న ఉప విద్యా శాఖాధికారి విలియమ్స్



ఎన్నికల అధికారుల వేషధారణలో పోలైన ఓట్లు లెక్కిస్తున్న విద్యార్థులు

బడిలో ఎన్నికలలో..

టెక్కలి మండలం పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్ ఎన్నికలు అట్టహాసంగా నిర్వహించారు. ఉప విద్యా శాఖాధికారి విలియమ్స్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అచ్చం సార్వత్రిక ఎన్నికలను తలపించేలా పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు, ఓట్ల లెక్కింపు సిబ్బంది వేషధారణలో విద్యార్థులు ఈ ఎన్నికలు నిర్వహించారు.

– టెక్కలి

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ పి.లత తెలిపారు. కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వీటికి దరఖాస్తులు కోరుతున్నామని, పీజీ చేసి ఉండాలని కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అలాగే పీహెచ్‌డీ, నెట్, సెట్, ఎస్ఎల్ఈటీ వంటి అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 28 తేదీలోగా పోస్టు ద్వారా, నేరుగా అయినా వచ్చి దరఖాస్తులు ఇవ్వవచ్చన్నారు. 29న మౌఖిక పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.

అరసవల్లిలో అమరావతి రైతుల ప్రత్యేక పూజలు

అరసవల్లి: అమరావతి టు అరసవల్లి పేరుతో రాజధాని ప్రాంత రైతులు గురువారం ఉదయానికి అరసవల్లి ఆదిత్యుని సన్నిధికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి స్థానిక టీడీపీ క్యాడర్ ఘనంగాఆహ్వానించి అధికారికంగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు హనుమాన్ చాలీసాను 108 సార్లు పారాయణం చేశారు. అమరావతి రైతులు అరసవల్లి వస్తున్న సమాచారం ఉన్నప్పటికీ స్థానిక టీడీపీ నేతలు మినహా జనసేన, బీజేపీ నేతలెవ్వరూ కనిపించలేదు.

రొట్టవలస అగ్రికల్చర్ అసిస్టెంట్ సస్పెండ్

సరుబుజ్జిలి: రొట్టవలస గ్రామ సచివాలయంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.దుర్గారావుని విధి నిర్వహణలో అలసత్వం కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు మండల వ్యవసాయాధికారి బి.పద్మనాభం గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. దుర్గారావు విధులకు మద్యం సేవించి హాజరవుతూ, రైతులకు ఎరువులు, ఇతరత్రా సరకులు అందించడంలో నిర్లక్ష్యం వహించినట్లు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అగ్రికల్చర్ ఏడీ విచారణ నిర్వహించి అగ్రికల్చర్ జేడీకి ఇచ్చిన నివేదిక మేరకు సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

పుత్ర భిక్ష పెట్టండి

- రెండున్నరేళ్ల బాలుడికి బ్లడ్ కేన్సర్
- చికిత్స కోసం సాయం అర్థిస్తున్న తల్లిదండ్రులు

కంచిలి:

రెండున్నరేళ్ల వయసు. ముద్దుగారే రూపం. కానీ ఆ వయసులోనే కేన్సర్ మహమ్మారి బుజ్జాయిపై దాడి చేసింది. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వెళ్తే బ్లడ్ కేన్సర్ ఉందనే చేదు నిజం తల్లిదండ్రులకు తెలిసింది. వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న ఆ కుటుంబానికి ఆ చిన్నారికి చికిత్స చేయించడం తలకు మించిన భారమే. దాతలు సాయం చేసి తమకు పుత్రభిక్ష పెట్టాలని వారు వేడుకుంటున్నారు.

కంచిలి మండలం కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య, ధనలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు. మొదటి సంతానం కుమార్తె, రెండో సంతానం కుమారుడు. వీరి రెండున్నరేళ్ల కుమారుడు పైల రిషికేశకు ప్రాణాంతకమైన బ్లడ్ కేన్సర్ వ్యాధి సోకింది. వారం రోజుల కిందట జ్వరం రావడంతో సోంపేటలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ప్లేట్‌లెట్స్ డౌన్ కావడంతో శ్రీకాకుళం కిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడి నుంచి బోన్‌మేరో టెస్టు చేయించాలని విశాఖపట్నం అరిలోవలో గల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్ష చేసిన తర్వాత బ్లడ్ కేన్సర్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో ఆ తల్లిదండ్రులు హతాశులైపోయారు. ఈ వ్యాధి ఎంతటి తీవ్రతలో ఉందనేది నిర్ధారించే పరీక్షకు శ్యాంపిల్స్ మరో చోటకు పంపారు. వారం రోజుల్లో ఆ పరీక్ష ఫలితాలు వచ్చాక అవసరమైన చికిత్స చేయడానికి వీలు పడుతుందని విశాఖ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు తెలియజేసినట్లు బాలుని తల్లిదండ్రులు తెలిపారు.

వ్యవసాయ కుటుంబానికి చెందిన తమకు అంత డబ్బు ఖర్చు పెట్టే స్తోమత లేదని, ఏం చేయాలో అర్థం కావడం లేదని అమ్మానాన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. దాతల సాయం కోసం వీరు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వీరికి తెలిసిన వారు తలో చేయి వేసి ఆర్థిక సాయం అందించడానికి విరాళాల సేకరణ ప్రక్రియ ప్రారంభించి, కొంత మొత్తాన్ని వసూలు చేయడం జరిగింది. దాతలు సాయం చేస్తే తమ బిడ్డ ప్రమాదం నుంచి బయట పడతాడని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాయం చేయదలచుకున్న వారు
9542232088
నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.



విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు పైల రిషికేశ

ప్రాణం మీదకు తెచ్చిన అతివేగం

శ్రీకాకుళం క్రైమ్ : మైనర్ల అతివేగం ఓ విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. శ్రీకాకుళంలో ముగ్గురు మైనర్లు గురువారం అతివేగంగా బైక్‌ను డ్రైవ్ చేస్తూ ఓ విద్యార్థినిని ఢీకొట్టారు. ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ప్రభుత్వ డిగ్రీ (ఆర్ట్స్) కళాశాలలో బీకాం మూడో సంవత్సరం చదువుతున్న పొట్నూరు హారిక తన స్నేహితురాళ్లతో కలిసి జిరాక్స్ తీసి అక్కడే పార్క్ చేసి ఉన్న ఓ బస్సు వెనుకవైపు నుంచి నడుచుకుంటూ వస్తోంది. అంతలోనే ఆర్ట్స్ కళాశాల వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు ఇంటర్మీడియెట్ విద్యార్థులు అతివేగంగా బండిని పోనిస్తూ ఆమెను ఢీకొట్టారు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. సమీపంలో విద్యార్థులు ఉండడంతో వారంతా వచ్చి వెంటనే సపర్యలు చేశారు. హారికను 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన విద్యార్థులకు అక్కడున్న వారు దేహశుద్ధి చేశారు. హారికకు నోటిపై, కంటిపై రక్తగాయాలే కాక ఎడమకాలికి కూడా దెబ్బ తగిలినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆమె కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. హారిక తల్లి చనిపోవడంతో బైరిసింగుపురంలో ఉన్న అమ్మమ్మ వాళ్ల ఇంటి వద్ద నుంచి రోజూ కళాశాలకు వస్తుంది. జరిగిన ప్రమాదాన్ని తెలుసుకున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. చర్యలు తీసుకోవాలని సీఐ ఎం.అవతారంను ఆదేశించారు. ఈ దారిలో ప్రైవేటు బస్సులను నిలుపుదల చేస్తున్నారని, యువకులు కూడా రేసింగ్ చేస్తున్నారని వారిని అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రిమ్స్‌లో తీవ్ర గాయాలతో ఉన్న విద్యార్థిని పొట్నూరు హారిక

28న జిల్లా సీనియర్స్ బీచ్ కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల జట్ల ఎంపికలను ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాదు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే వారికి ఎలాంటి వయో నిబంధనలు లేవని, అయితే పురుషులు, 85 కేజీలు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను ఆగస్టు 2 నుంచి 4 వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సాదు శ్రీను కోరారు. మరిన్ని వివరాలకు 8074066282, 9441262515 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆయిల్ ఇంజిన్లు చోరీ

జలుమూరు: మండల పరిధిలోని కరకవలస, శ్రీముఖలింగం, అక్కురాడ తదితర గ్రామాల్లో వరుసగా ఆయిల్ ఇంజిన్లు చోరీకి గురవ్వడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వంశధార కాలువలు, చెరువుల నుంచి నీటిని ఆయా పంట పొలాలకు తోడే ఇంజిన్లు మండల పరిధిలోని పలు గ్రామాల్లో చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులైన వరినాట్లు వేయడం, దమ్ము పట్టడం తదితర పనుల కోసం మెరక ప్రాంతాలు, కూరగాయల సాగునకు నీటి ఇంజిన్లు ఎంతో అవసరం. ఇప్పటికే మండలంలో చాలా వరకూ ఆయిల్ ఇంజిన్లు పోలీసులు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఇందులో త్రీ హెచ్‌పీ నుంచి ఫైవ్ హెచ్‌పీ వరకూ ఉన్నాయి. ఒక్కో ఇంజిన్ రూ. 25 వేలు నుంచి రూ.లక్ష వరకూ ఉంటుందని రైతులు చెబుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో పోయినవి ఇంకా పట్టుకోవాల్సి ఉంది. దొరికిన ఆయిల్ ఇంజిన్లు రైతులకు అప్పజెప్పాలని రైతులు కోరుతున్నారు. దీనిపై హెచ్‌సీ రాజశేఖర్‌ను వివరణ కోరగా కేసు నమోదు కాలేదని తెలిపారు.



స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఆయిల్ ఇంజిన్లు

డిప్లమా పారామెడిల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: ఏపీ స్టేట్ అండ్ హెల్త్‌కేర్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమో పారామెడికల్ కోర్సులకు కన్వీనర్ కోటాలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ ఏ గ్రూప్ పాసైన వారైనా అర్హులేనన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటాలో అందుబాటులో సీట్లు ఉన్నాయని ఆసక్తి గల వారు తగు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7995013422, 7680945357 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

పాతపట్నం: మండల కేంద్రంలోని శివశంకర్ కాలనీ జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడి ఆటోడ్రైవర్ బచ్చల గోపి(37) అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి 11గంటల సమయంలో పాతపట్నం నుంచి పర్లాకిమిడి వెళ్తుండగా ఎదురుగా కుక్క రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. దీంతో డ్రైవర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఆయన మాత్రమే ఉన్నాడు. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వర్సిటీ అధ్యయన కేంద్రానికి డైరెక్టర్ నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రారంభించిన అధ్యయన కేంద్రానికి ఆర్గానిక్ కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.పద్మారావును డైరెక్టర్‌గా నియమిస్తూ రిజిస్ట్రార్ పి.సుజాత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజినికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, బోధకులు పరిశోధనలకు ప్రాధాన్యతన ఇవ్వాలని సూచించారు.

'ప్రయాణికులకు సదుపాయాలు కల్పిస్తాం'

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ప్రయాణించే వారికి మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో గురువారం ఆర్టీసీ ఈడీ సీహెచ్ రవికుమార్ డిప్యూటీ సీటీఎం (ఓ అండ్ సి) అప్పలనాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన, సౌకర్యవంతమైన, మంచి కండీషన్‌లో గల బస్సులను ఇవ్వాలని ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల డీఎంలకు సూచించారు. ప్రయాణికుల సరుకులను అత్యంత వేగంగా, భద్రంగా, దూర ప్రాంతాలకు కూడా చేరవేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని శ్రీకాకుళం జిల్లా ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.విజయ్ కుమార్, శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ పి.మల్లికార్జునరాజు, రెండో డిపో మేనేజర్ కెఆర్ఎస్ శర్మ, ఆర్టీసీ డీఈ బమ్మిడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాంప్లెక్స్ ఆవరణలోని నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద పరిశీలిస్తున్న ఈడీ రవికుమార్

సెల్ కాన్ఫరెన్స్‌కు చెల్లు

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లాలో తన మార్కు చూపేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా పోలీస్ శాఖలో సమూల మార్పులు తీసుకొచ్చే దశలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందితో సెట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనను న్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఉన్న 44 పోలీస్ స్టేషన్లలో 1800 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు సెల్ కాన్ఫరెన్స్‌లో ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటలకు, రాత్రి ఏడున్నర గంటలకు ఎస్పీతో మాట్లాడేవారు. ఇకపై దాని స్థానే ప్రతీ పీఎస్ పరిధిలో సెట్ కాన్ఫరెన్సు నిర్వహించనుండగా ప్రతి రోజూ ఉదయం ఏడుగంటలకు సీఐ, ఎస్ఐలు ఎస్పీతో మాట్లాడతారు. అనంతరం ప్రతిరోజూ ఉదయం ఎనిమిది గంటలకు పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి రోల్‌కాల్ చేసి స్టేషన్ల విషయాలను చర్చించాల్సి ఉంటుంది. ఇవే కాక రాత్రి విధుల్లో పాల్గొనేందుకు సీఐ, ఎస్ఐలు రాత్రి పది గంటలకే రహదారులపై తిరగాలని, ఉదయం ఐదు గంటల వరకు ఈ విధుల్లో పాల్గొనాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి నైట్ బీట్ చేసిన ఫొటోలు, వీడియోల్లో పొందుపర్చాలని ఆదేశాలు ఇచ్చారు.

మత్స్యకారులకు ఇబ్బంది రాకూడదు

- స్పష్టం చేసిన తీర ప్రాంత ప్రజలు
- సీఆర్‌జెడ్ అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్) అమలు చేసే క్రమంలో మత్స్యకారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకూడదని తీర ప్రాంత ప్రజలు స్పష్టం చేశారు. జిల్లా కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఖరారులో భాగంగా సీఆర్‌జెడ్ నోటిఫికేషన్ విడుదలపై గురువారం తీర ప్రాంత ప్రజలు, అధికారులతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఆర్‌జెడ్‌పై అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందించాలని కోరారు. అభిప్రాయాలను రికార్డు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అలాగే సూచనలు, సలహాలు, అభ్యంతరాలు ఉంటే ఇప్పుడే తెలియజేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అప్పికొండ రామారావు నాయుడు కోరారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డీడీ సుభాన్, చెన్నై నుంచి వచ్చిన కన్సల్టెన్సీ కరుణానిధి, యువరాజ్ సీఆర్‌జెడ్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

- కేవీ జగన్నాథరావు మాట్లాడుతూ పైడిభీమవరం వంటి ప్రదేశాల్లో పరిశ్రమల మీద తగిన నియంత్రణ చేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కోనాడ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కంపెనీల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కె.లక్ష్మణ్ మాట్లాడుతూ మత్స్యకారుల పిల్లలు ఉద్యోగాలు పొందేందుకు కూడా అర్హత కలిగి ఉన్నారన్నారు.
- కవిటి మండలం నుంచి పురుషోత్తం మాట్లాడుతూ ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి కోస్టల్ ఏరియా అంతా రోడ్లు వేస్తే టూరిజం అభివృద్ధి చెందుతుందన్నారు.
- కొత్తముక్కాం గ్రామం నుంచి యు.సన్యాసిరావు మాట్లాడుతూ సముద్ర తాబేళ్ల నశించిపోకుండా సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.
- ఎచ్చెర్ల మండలం నుంచి సీహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ సీఆర్‌జెడ్ అంశాలను ప్రస్తావించి వ్యతిరేకించారు.
- సముద్రానికి 50 మీటర్లలో మత్స్యకార కార్యకలాపాలు చేసుకోవచ్చని, మత్స్యకారులకు ఇబ్బంది లేదని, 500 మీటర్లు దాటిన తర్వాత టూరిజం, తదితరమైనవి నిర్వహించుకోవచ్చని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుభాన్ వివరించారు. టూరిజం ప్రాజెక్టుల వద్ద మత్స్యకార బోట్‌లు పెట్టుకొనేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

ఇంటర్నేషనల్ జర్నల్‌లో పలాస యువకుడి థీసిస్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 20వ వార్డుకు చెందిన బమ్మిడి సంతోష్‌కుమార్ రాసిన థీసిస్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైంది. ఆంధ్రా యూనివర్సిటీలో పీహెచ్‌డీ స్కాలర్‌గా ఉన్న సంతోష్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్‌పై సోషియో ఎకనామిక్ ఇంపాక్ట్ ఆన్ ద రూరల్ ఎకానమీ అనే అంశంపై రాసిన పేపర్‌ను యూజీసీ వారి సహకారంతో ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురించారు. దీనిపై సంతోష్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో వలసలు నివారించడానికి, గ్రామీణ స్థాయిలో ఆదాయాన్ని మెరుగుపరచడానికి ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకంపై తాను థీసిస్ రాసినట్లు తెలిపారు. ప్రస్తుతానికి గ్రామస్థాయిలో ఒక వ్యక్తి ఆదాయ స్థితిగతులు, జీవన స్థితిగతుల్ని స్టడీ చేసి పేపర్ ప్రజెంటేషన్ చేసి రాసి ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులుగా పనిచేస్తున్నారు.



సంతోష్‌కుమార్

రిమ్స్ వద్ద ఆందోళన

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్‌కు కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స కోసం వచ్చిన ఓ మహిళ మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రిమ్స్‌లో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకోగా గురువారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెలితే... లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పి.లక్ష్మి అనే మహిళ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కోసం మంగళవారం రిమ్స్‌లో చేరారు. బుధవారం మధ్యాహ్నం ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించారు. అదే రోజు సాయంత్రం ఆమె మృతి చెందారు. శస్త్ర చికిత్స వికటించటం వల్లనే లక్ష్మి మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తూ మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు నిరాకరించారు. కొందరు పెద్దలు జోక్యం చేసుకుని లక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని కోరగా ప్రభుత్వం తరఫున సాయం అందేలా చూస్తామని అధికారులు భరోసా ఇవ్వటంతో పరిస్థితి సద్దుమణిగింది. గురువారం ఉదయం మరోసారి మృతురాలి బంధువులు ఆస్పత్రికి వచ్చి ఆందోళన చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షితో పాటు ప్రత్యేక బృందం సభ్యులు రిమ్స్ అధికారులను విచారించారు. గుండె పోటుతో లక్ష్మి మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. ఇదే విషయాన్ని ఉన్నత అధికారులకు నివేదించారు. ప్రభుత్వ సహాయం కోసం సిఫారసు చేస్తూ నివేదికను పంపించారు. ఈ విషయంలో పోలీసులు కూడా విచారణ చేస్తున్నారు.